ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024



మూల్యాంకనం పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకులు క్రిష్ణారెడ్డి, డీఈవో అనురాధ



ప్రారంభమైన టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: పదోతరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. కడప నగరంలోని నగరపాలక ఉన్నతపాఠశాల మెయిన్‌లో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని పరీక్షల జిల్లా పరిశీలకులు మార్తల క్రిష్ణారెడ్డి డీఈవో అనురాధతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పాట్ వాల్యుయేషన్‌లో అలసత్వం తగదని, జవాబు పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మార్కులు వేయాలని, ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని మూల్యాంకనం చేయాలని అన్నారు. జిల్లాకు కేటాయించిన పరీక్ష పత్రాలను ప్రతిరోజూ సబ్జెక్టు వారీగా ఇచ్చేముందు.. తీసుకునే తరువాత ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎంఈవోలు, ఎగ్జామినేషన్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్



వైసీపీ నేతల ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ బి.బాలక్రిష్ణారెడ్డి

కడప, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా ఈ మార్గదర్శకాలను వలంటీర్లు ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో వైసీపీ వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సోమిరెడ్డిపల్లె సచివాలయం-3లో వలంటీరుగా పనిచేస్తున్న బి.బాలక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆ ఫొటోలను అతనే వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు ఆ వలంటీరును సంజాయిషీ కోరినట్లు సమాచారం.

నేడు జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 1: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలు మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. 2 గంటలకు రోడ్డు మార్గాన వెళ్లి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి తిరిగి కడపకు వస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో జమాయతే ఉలిమ హింద్ సంస్థను సందర్శిస్తారన్నారు. సాయంత్రం 5-30 గంటలకు కడప అమీన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని రాత్రికి తిరిగి ఇడుపులపాయకు చేరుకుని అక్కడే బస చేస్తారన్నారు. బుధవారం హైదరాబాదు వెళతారని తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వచ్చేలా ఆమె విజయానికి అందరూ కృషి చేయాలన్నారు.

జగన్ సేవలో ఆర్టీసీ

- మేమంతా సిద్ధం సభలకు జిల్లా నుంచి 187 బస్సులు
- 2, 3, 4 తేదీల్లో బస్సులన్నీ అక్కడికే
- ప్రయాణికులూ.. ఊరెళ్లాలంటే జాగ్రత్త





ఆర్టీసీ వైఎస్ జగన్ సేవలో తరిస్తోంది. మండే ఎండల్లో అత్యవసరమైన వారు మాత్రమే ఊర్లకు వెళతారు. అలాంటి వారికి కూడా బస్సులు అందుబాటులో లేకుండా చేస్తోంది. మేమంతా సిద్ధం పేరిట జగన్ నిర్వహిస్తున్న సభలకు జిల్లా నుంచి 187 బస్సులను ఆర్టీసీ పంపించింది. మూడురోజుల పాటు బస్సులన్నీ జగన్ సభలకు జనాలను తోలడానికే ఉపయోగించనున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత ప్రజారవాణా సంస్థగా అవతరించింది. అయితే ప్రజాసేవ మరిచి జగన్ సేవలో తరిస్తోంది. జనం కష్టాలను లెక్కచేయకుండా జగన్ సేవలో తరించడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కడప, నంద్యాల జిల్లాల్లో నిర్వహించిన మేమంతా సిద్ధం సభలకు, అనంతపురంలో నిర్వహించిన సభలకు ఆర్టీసీ బస్సులను పంపడంతో.. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇప్పుడు మరలా మూడురోజుల పాటు బస్సులన్నీ పంపుతుండడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పవు. మొత్తం 187 బస్సులు పంపిస్తున్నారు. మంగళవారం మదనపల్లెలో జరిగే మేమంతా సిద్ధం సభకు, 3న పూతలపట్టు, 4న నాయుడుపేటలో జరిగే సభలకు ఆర్టీసీ బస్సులను పంపించేశారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పేలా లేవు.

ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్నది ఆర్టీసీ బస్సులే. అలాంటి బస్సులను ప్రజలకు అందుబాటులో ఉండనివ్వకుండా.. వైసీపీ సభలకు తీసుకెళ్లిపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభలకోసం ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసుకోవచ్చు కదా.. ఇలా ఆర్టీసీ బస్సులను తీసుకెళ్లి పేద జనాలను ఇబ్బంది పెట్టడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ముగ్గురు వలంటీర్లపై కేసు నమోదు

కొండాపురం, ఏప్రిల్ 1: వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసినందుకు, తప్పుడు పోస్టులు పెట్టినందుకు ముగ్గురు వలంటీర్లపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బురుజుపల్లి సచివాలయ పరిధిలోని ఉస్తికాయలపల్లిలో అశోక్ కుమార్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి అనే వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు వెళ్లింది. బెడుదూరు సచివాలయ పరిధిలోని చవ్వానాగాయపల్లిలో చప్పిడి మంజుల అనే వలంటీర్ ప్రతిపక్ష పార్టీకి వ్యతిరేకంగా వలంటీర్ల గ్రూప్‌లో తప్పుడు పోస్టుపెట్టినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై కొండాపురం ఎంపీడీవో నాగప్రసాద్ విచారించి నిజమని తేలడంతో ముగ్గురు వలంటీర్లపై తాళ్ల ప్రొద్దుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారిపై కేసు నమోదు చేశామని తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్ల పంపిణీ త్వరతగతిన చేయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. వైసీపీ ప్రభుత్వం నిధుల కొరత కారణంగా పింఛన్లు పంపిణీ చేయడం లేదని.. అయితే ఎన్నికల కమిషన్, తెలుగుదేశంపై వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నిధులను సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పింఛన్ సొమ్ము ఖజానాలో లేకండా ఖాళీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుంచే ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీచేయలేదని ప్రశ్నించారు.

సచివాలయ సిబ్బంది 1.35లక్షల మంది ఉన్నారని వీరి ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ చేయవచ్చని వివరించారు. అది చేతగాక టీడీపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే వచ్చి నెలకు రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చారు.

వలంటీర్ వ్యవస్థ లేనప్పుడు పింఛన్లు పంచలేదా?

- ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1: వలంటీర్ వ్యవస్థ లేనప్పుడు పింఛన్లు పంచలేదా అని ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ వలంటీర్లతో కాకుండా పింఛన్ల పంపిణీకి వేరే ఏర్పాట్లు చేసుకోమని చెప్పిందే కానీ పింఛన్ల పంపిణీ ఆపమని ఆదేశించలేదన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ వలంటీర్లకు ప్రభుత్వ పనుల్లో సేవల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనరాదని ఆదేశాలు ఇచ్చిందన్నారు. వృద్ధులకు పింఛన్లు అందకుండా చంద్రబాబు అడ్డుకున్నాడని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతి సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటివద్దకే వచ్చి పంపిణీ చేస్తారన్నారు. ఈ విధానం గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఉందన్నారు. 1 తేదీన పింఛన్లు పంచడానికి వైసీపీ ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేక మూడో తేదీ నుంచి ఇస్తోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ వారు తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు.

పింఛన్లపై అవే తప్పుడు ఆరోపణలు

- వాయిస్ మెసేజ్ ద్వారా దుష్ప్రచారం

మైదుకూరు, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై అధికార పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తూనే ఉంది. నిన్నటి వరకు టెక్స్ట్ మెసేజ్‌లు పెట్టిన వైసీపీ నేతలు తాజాగా వాయిస్ మెసేజ్‌లు పెడుతున్నారు. సోమవారం పలువురికి ఫోన్ల ద్వారా వాయిస్ మెసేజ్‌లు వచ్చాయి. అందులో 'అవ్వా తాతలకు ప్రతి నెల 1వ తారీకున వలంటీరు ఇంటికి వచ్చి 3 వేలు డబ్బులు ఇచ్చేవారు. ఎన్నికలు ఇంకా 40 రోజులున్నా, పింఛను డబ్బులు అవ్వా తాతలకు పంచవద్దని తెలుగుదేశం పార్టీ వారు అడ్డుకున్నారు. కాబట్టి వలంటీర్లు ఇవ్వలేరు. వచ్చే ఎన్నికల్లో జగనన్న వస్తాడు. అప్పుడు మళ్లీ తిరిగి మీ ఇంటికే వచ్చి డబ్బులు ఇస్తాం' అంటూ ఫోన్ల ద్వారా వాయిస్ కాల్స్ వస్తున్నట్లు సమాచారం. ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్న అంశంపై కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీపై బురదజల్లే ప్రయత్నం

- పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 1: అవ్వాతాతలకు, అంగవైకల్యం వారికి పంపిణీ చేసే పింఛన్లపై వైసీపీ వాస్తవాలు దాచి తెలుగుదేశం పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తోందని పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. సోమవారం పట్టణంలోనిటీడీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు నిధులు కేటాయించడంతో ఖజానాలో నిధులు లేక పింఛన్లకు మంజూరు కాలేదన్నారు. వాస్తవాలు బయటకు రానివ్వకుండా వలంటీర్లను దూరం చేయడం ద్వారా పింఛన్ పంపిణీ అడ్డుకున్నారంటూ అబద్ధాలు చెబుతున్నారన్నారు. ప్రతి సచివాలయంలో 18 మంది దాకా ఉద్యోగస్తులు ఉన్నారని వారందరు ఆ సచివాలయం పరిధిలో పింఛన్‌దారులకు ఒక్క గంటలోపు పంపిణీ చేయవచ్చన్నారు. అందుకే ఎన్నికల కమిషన్ వలంటీర్లను పక్కన పెట్టిందన్నారు. ఏ బ్యాంకులో అయినా ఈరోజు పింఛన్‌కి సంబంధించి నిధులు మంజూరయ్యాయేమో చూపించాలన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్ ఇద్దరు మహిళా కూలీలు మృతి

● ఆటో డ్రైవర్, మరో మహిళకు తీవ్ర గాయాలు



మృతి చెందిన వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి

రాజంపేటటౌన్, ఏప్రిల్ 1: కూలీ పనుల కోసం ఆటోలో కూలీలు వెళుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోలి గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాజంపేట మండల పరిధిలోని హత్యరాల గ్రామానికి చెందిన కూలీలు కూలీ పనుల కోసం సోమవారం తెల్లవారు జామున ఆటోలో రాజంపేట వైపు బయలుదేరారు. పోలి గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటలక్ష్మీ (30) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ మురళి, ఆదిలక్ష్మి మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు గుర్తించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మి(25)ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ సంఘటనపై రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఒకే రోజు హత్యరాల హరిజనవాడలో ఇద్దరు మహిళలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



నాగిరెడ్డి రమణారెడ్డి (ఫైల్), ట్రాన్స్‌ఫార్మరు వద్ద పడిపోయిన రమణారెడ్డి

బి.కోడూరు, ఏప్రిల్ 1: పొలంలో నీళ్ల కట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలం పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి రమణారెడ్డి (38) శనివారం రాత్రి భార్య రామలక్షుమ్మకు తాను పొలం వద్దకు వెళుతున్నానని.. అటు నుంచే అటే తెల్లవారు జామున భూమిరెడ్డిపల్లె (అత్తగారి ఊరికి)కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. పశువుల మేత కోసం వేసిన చొప్పకు నీళ్ల పారకట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టరు నొక్కి చూశాడు. మోటరు ఆడకపోవడంతో ట్రాన్స్‌ఫార్మరు వద్దకు వెళ్లి ఫీజు పోయిందని గమనించి.. కదిలిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన కొంత మంది పశువులు మేపుకునేందకు వెళ్లి చూడగా రమణారెడ్డి శవమై పడి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు లబోదిబోమంటూ అక్కడకు చేరుకుని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసు కెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలపడంతో బి.కోడూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ జయరాములు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ఖాజీపేట, ఏప్రిల్ 1: మండల పరిధిలోని దుంపలగట్టులో అప్పులబాధతో విషద్రావణం తాగి బుక్కన శివశంకరయ్య (36) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే... దుంపలగట్టుకు చెందిన శివశంకరయ్య పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగించేవాడు. సాగు చేసిన పంట చేతికి రాక అప్పులబాధతో శనివారం విషద్రావణం తాగాడు. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖాజీపేట పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం కథనం మేరకు.. తిరుపతి నుంచి ధర్మవరం వైపు వెళుతున్న రైలు సీటీఎం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే అక్కడే వున్న ఓ మహిళ(34) హఠాత్తుగా రైలు కింద పడిపోయి అక్కడిక్కడే మృతి చెందిందని తెలిపారు.

అంతుబట్టని తెగులు... ఎండుతున్న చీనీ తోటలు

● వేల ఎకరాల్లో దెబ్బతిన్న చెట్లు
● ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచని స్థితిలో రైతులు
● కాపాడుకునేందుకు లక్షలు ఖర్చు చేస్తున్న వైనం

అంతుబట్టని తెగులు చీనీ రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎంతో కష్టపడి పెంచి పోషించుకున్న చెట్లు కళ్లముందే నిలువునా ఎండుతున్నాయి. మంచి దిగుబడులు ఇస్తాయనుకున్న సమయంలో చెట్లు నాశనమైపోవడం చూసి రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మిగిలిన చెట్లను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

పులివెందుల, ఏప్రిల్ 1: పులివెందుల నియోజకవర్గం చీనీ పంటకు పెట్టింది పేరు. దాదాపు 25వేల ఎకరాల్లో చీనీ వివిధ దశల్లో సాగులో ఉంది. 18వేల ఎకరాలలో చీనీ దిగుబడులు అందిస్తున్న తోటలే ఉన్నాయి. గత రెండేళ్లుగా ఈ తోటలకు మాయదారి రోగం పట్టుకుంది. దీంతో వేల ఎకరాల్లో చీనీచెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. చీనీ చెట్లు మొదళ్లలో బంక కారుతూ చెట్టుకు ఉన్న తాట అంతా పొలుసులాగా మారి కాయలతో ఉన్న చీనీచెట్లే ఎండిపోతున్నాయి. డిసెంబరు నుంచి ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంది. ఏం చేయాలో అంతుబట్టని పరిస్థితి.

ఐదేళ్లపాటు పోషించాల్సిందే...

చీనీ తోటలు సాగుచేయాలంటే అంటు నాటినప్పటి నుంచి డ్రిప్పు ఏర్పాటు చేసుకునే వరకు ఎకరాకు దాదాపు రూ.40వేల నుంచి రూ.50వేలు ఖర్చు అవుతుంది. అంటు నాటినప్పటి నుంచి ఐదేళ్ల పాటు కన్నబిడ్డల్లాగా చూసుకోవాల్సి ఉంటుంది. దాదాపు చెట్టుకు 20 ఏళ్లు వచ్చే వరకు దిగుబడులు వస్తాయి. అంటే ఎలాంటి దిగుబడి లేకపోయిన ఐదేళ్ల పాటు చెట్లను పోషించాల్సిందే.



తెగులు కారణంగా కాయలతోనే నిలువునా ఎండిన చీనీ చెట్టు

చెట్లను కాపాడుకునేందుకు.....

తెగులు సోకిన చెట్లను కాపాడుకునేందుకు రైతులు మందుల పిచికారీకి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఎకరం చీనీ తోటకు దాదాపు 500 లీటర్ల మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. దీనికి దాదాపు రూ.25వేలు ఖర్చుచేస్తున్నారు. అయినప్పటికీ తెగులు నుంచి చెట్లను కాపాడుకోలేకపోతున్నారు. ప్రస్తుతం 12 నుంచి 15 ఏళ్ల వయసున్న చీనీతోటలు ఎండుతున్నాయి. తెగులుతో ఎండిపోతున్న చీనీ తోటలన్నీ కూడా ప్రస్తుతం దిగుబడులు వస్తున్నవే. మంచి దిగుబడులు వచ్చే సమయంలో ఇలా తోటలు ఎండిపోవడం రైతులను అటు మానసికంగా ఇటు ఆర్థికంగా పూర్తిగా కుంగదీస్తోందనే చెప్పాలి.

వేల ఎకరాల్లో ఎండిపోతున్నాయి..

అంతుబట్టని తెగులుతో వేల ఎకరాల్లో చీనీచెట్లు ఎండిపోతున్నాయి. ఒక ఎకరం చీనీ తోటలో ఏడాదికి ఒకటి నుంచి ఐదు చెట్ల వరకు పలు రకాల తెగుళ్లతో చనిపోవడం సర్వసాధారణం. కానీ ఈ ఏడాది డిసెంబరు నుంచి ఎకరం తోటలో ఇప్పటికే సగభాగం చెట్లు చనిపోతున్నాయని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఐదు ఎకరాలు ఉన్న పది ఎకరాలు ఉన్న తోటలు సైతం దాదాపు వంద నుంచి 200 చెట్ల వరకు బంక కారడం, మొదలుకు పెలుసు పెలుసుగా తాట లేచిపోవడం, కాయలు ఉన్న చెట్లే ఎండిపోవడం జరుగుతోంది.

చేతులెత్తేసిన ఉద్యాన శాఖ

తెగుళ్లు సోకి చీనీ చెట్లు నిలువునా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నా ఉద్యానశాఖ అధికారుల నుంచి సరైన సహకారం లేదని రైతులు చెబుతున్నారు. తోటల్లో చీనీ చెట్లు ఎండిపోతున్నాయని, ఏమి చేయాలని వారి దృష్టికి తీసుకెళితే.. ఇది వేరుకుళ్లు తెగులు అని, ఈ తెగులును అరికట్టాలంటే ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. కానీ వేరుకుళ్లు తరహా రోగం కాదని, ఇది చెట్టు మొదళ్లలోనే వస్తోందని రైతులు చెబుతున్నారు. ఉద్యానశాఖ అధికారులు చెప్పిన మందులు పిచికారీ చేసిన ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు.



తెగులు సోకడంతో నిలువునా ఎండిపోయిన చీనీచెట్టు

ఎన్ని మందులు పిచికారీ చేసినా...



చీనీ చెట్లను కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఉపయోగం లేదు. మేము ఐదు ఎకరాల పొలంలో చీనీతోట సాగు చేశాము. చీనీతోట సాగు చేసి 14 ఏళ్లు గడిచింది. ప్రస్తుతం మంచి దిగుబడులు వస్తున్నాయి. కానీ ఈ ఏడాది డిసెంబరు నుంచి చెట్లకు బంక కారి నిలువునా ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా చెట్లు మాత్రం చనిపోతూనే ఉన్నాయి. తోటలు పూర్తిగా తీసేసే పరిస్థితులు వస్తాయని భయమేస్తోంది.

-గట్టు శివమ్మ, బచ్చయ్యగారిపల్లె, వేముల మండలం.

ప్రణాళికాబద్ధంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, అధికారులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1: జిల్లాలో ప్రణాళికాబద్ధంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులపై రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తగిన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఈటీపీబీఎస్ ద్వారా సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్, జనరేషన్‌ను పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవో, ఓపీఈవో, మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు, ఇతర ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాల్లో కట్టుదిట్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో సత్యనారాయణరావు, వివిధ జిల్లాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ కుంభకోణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: గ్రూప్-1ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్, సెక్రటరీ ఆంజనేయులు వారికి అండగా ఉన్న సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామక్రిష్ణారెడిలపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాబుద్దీన్ డిమాండ్ చేశారు.

సోమవారం కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 2018 డిసెంబరులో 162 పోస్టులతో గ్రూప్1 నోటిఫికేషన్ విడుదల చేయగా 2019 మేలో పరీక్షలు నిర్వహించారన్నారు. నోటిఫికేషన్‌లో మాన్యువల్ మూల్యాంకనం పద్ధతిలో జరుగుతుందని తెలిసి తారుమారు చేసేందుకు యత్నించి దాదాపు 49వేల ఓఎంఆర్ షీట్లు మార్చి అంగట్లో సరుకులు అమ్మినట్లు వైసీపీ ప్రభుత్వం 162 గ్రూప్1 ఉద్యోగాలను కోట్ల రూపాయలకు అమ్ముకుందని మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, విశ్వనాధ్, మహేశ్, శ్రీను, తెలుగుయువత నాయకులు చక్రి, వత్స, విజయ పాల్గొన్నారు.

పింఛనుదారులను ఇబ్బంది పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే వైసీపీ కుట్ర

● మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1 : రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడం ఎన్నికల కమిషన్ బాధ్యత. అధికార పార్టీ వైసీపీ సామాజిక పింఛనుదారులను వలంటీర్ల ద్వారా ప్రలోభపెడుతున్న వైనం తమకందిన ఫిర్యాదుల ద్వారా పరిశీలించి... నిజం ఉందని నిరూపణ కావడంతో ఎన్నికల కోడ్ ముగిసే వరకు సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయరాదని ఆదేశాలు ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య ప్రకటనలో తెలిపారు. అయితే ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ సహేతుక నిర్ణయాన్ని అందరూ హర్షిస్తుంటే.. వైసీపీ మాత్రం గగ్గోలు పెడుతోందన్నారు. తమ కుట్ర ఫలించలేదన్న అక్కసు ఆ పార్టీ నేతల్లో కనిపిస్తుందని వాపోయారు.

ఎన్నికల సమయంలో వలంటీర్లపై వత్తిడి పెంచి తమకు అనుకూలంగా వైసీపీ అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారన్న వార్తలు మీడియాలో వచ్చాయన్నారు. అలాగే అధికార పార్టీ అభ్యర్థుల ప్రచారంలో కొందరు వలంటీర్లు పాల్గొన్న ఫొటోలు, వీడియోలు బయటికి వచ్చాయన్నా రు. దీనిపై సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందన్నారు. వైసీపీ ఆరోపణలు చేస్తున్నట్లు ఈ సంస్థ తెలుగు దేశం పార్టీకి అనుబంధానమైనదని కాదన్నారు. ఇందులో తటస్థులైన మేధావులు ఉన్నారని, వారికి రాజకీయ దురుద్దేశ్యాలు ఆపాదించడం వైసీపీ కుసంస్కారం తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

రాజంపేట టౌన్, మార్చి 1: రాజంపేట మండలం నారమరాజుపల్లెలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు రాసిన పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలియజేశారు.

2024 జనవరి 20వ తేదీ విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగిందని, అందుకు సంబంధించిన ఫలితాలు హెచ్‌టీటీపీఎస్:// డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ.జీవోవి.ఇన్/ఎన్‌విఎస్/ఎన్‌విఎస్-స్కూల్/కడప/ఈఎన్/హోమ్/ వెబ్‌సైట్‌లో రోల్ నెంబరు వారీగా పొందుపరచడం జరిగిందని.. విద్యార్థులు పరిశీలించుకోవాలన్నారు. విద్యార్థులు సమర్పించే సర్టిఫికెట్లు సరైనవా కాదా.. అని నిర్ధారించిన తరువాత ప్రవేశం కల్పిస్తామని, అంత వరకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్టు తీసుకురావాలని తెలియజేశారు.

సమస్యలు 'ప్లస్'



బద్వేలులో వసతులు లేకపోయినా టెన్త్ ప్లస్ నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల

● ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ అట.. ● ఉన్న వాటికే వసతులు లేవు
● తరగతి గదులు ల్యాబ్‌లకు దిక్కులేదు ● మరో 18 జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్)
● ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభానికి సన్నాహాలు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: వచ్చే విద్యాసంవత్సరం నుంచి జిల్లాలో కొత్తగా 18 ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్) ప్రారంభించనున్నారు. 18 చోట్ల కోఎడ్యుకేషన్ (బాలురు, బాలికలు)కు ఇంటర్ తరగతులు బోధించనున్నారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు మాధ్యమిక విద్యనందించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రతి మండలంలో బాలికలకు 1, బాలబాలికలకు కలిపి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2022-23 విద్యాసంవత్సరం నుంచి హైస్కూలు ప్లస్ పేరుతో ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. జిల్లాలో ఇలా 13 పాఠశాలల్లో ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఇక 2024-25 విద్యాసంవత్సరం నుంచి కోఎడ్యుకేషన్ హైస్కూలు ప్లస్ ఏర్పాటుకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీనికిగాను జిల్లాలో 18 మండలాల్లో ఈ జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉన్నవాటికే దిక్కు లేదంటే.. మరో 18 వాటిని ప్రారంభిస్తే ఎలా అని విద్యాశాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వెంటాడుతున్న సమస్యలు

ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించాలంటూ ఉత్తర్వులు జారీ చేసినా.. ఆ మేరకు వసతులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా సిబ్బంది నియామకం నుంచి నిర్వహణ వరకు అన్నీ సమస్యలే. హైస్కూలు ప్లస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటర్మీడియట్ విద్య నిర్వహణ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వీటికి ప్రత్యేకమైన భవన నిర్మాణాలు, ఆటస్థలాలు, ల్యాబ్‌లు శాశ్వత ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. చివరికి వ్యాయామ ఉపాధ్యాయుడు లేకుండా తూతూమంత్రంగా హైస్కూలు ప్లస్ ప్రారంభించారు. అందుకే వీటిల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. ఆశించిన రీతిలో ప్రవేశాలు జరగడంలేదు.

అలంకారప్రాయంగానే..

ఇంటర్మీడియట్ విభాగం సూచనల మేరకు బోధనా సిబ్బంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాత్రమే బోధిస్తే సరైన న్యాయం జరుగుతుందని.. అయితే హైస్కూలు ప్లస్‌లో నియమించిన బోధన సిబ్బంది 9 నుంచి 12తరగతుల వరకు బోధించడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురుచెబుతున్నారు. బోధనా సిబ్బంది నియామకాల్లో సైతం విద్యాశాఖ అలసత్వంతో అలంకార ప్రాయంగానే హైస్కూలు ప్లస్ కొనసాగుతున్నాయి. అరకొర విద్యార్థులు చేరినా వారికి శాస్త్రీయ అభ్యసన నిమిత్తం ల్యాబ్ సౌకర్యం లేదు. దీంతో దగ్గరలో ఉన్న మోడల్ స్కూలులోని జూనియర్ కళాశాలలకు వెళ్లి ప్రయోగాలు అభ్యసనం చేయాలని విద్యాశాఖ ఆదేశించడం పట్ల విద్యార్థులు దాదాపు పదికిలో మీటర్ల పైబడ్డ దూరంలో ఉన్న కళాశాలలకు వెళ్లి అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో చెన్నూరు హైస్కూలు ప్లస్‌లో విద్యార్థులు ఖాజీపేటలోని మోడల్ స్కూలుకు పది కి.మీ మేర ప్రయాణించి ప్రాక్టీసు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో అన్ని హైస్కూలు ప్లస్‌ల పరిస్థితి ఇలానే ఉందని తెలుస్తోంది. దీంతో పాటు బోధనా సిబ్బందికి చెల్లిస్తామన్న వేతన ఇంక్రిమెంట్లు దానికి సంబంధించిన బకాయిలు తమ అకౌంటులో ఎప్పుడు పడతాయోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఇలా పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఎటువంటి ప్రణాళికలు లేకుండా కోఎడ్యుకేషన్ హైస్కూలు ప్లస్‌లు ప్రారంభిస్తామని విద్యాశాఖ ప్రకటన చేయడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైస్కూలు ప్లస్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు పరచకపోవడం కొసమెరుపు.

ముందు సౌకర్యాలు కల్పించాలి..



శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించాలి. బోధనా సిబ్బంది ఇంక్రిమెంట్లను మూల వేతనంలో శాశ్వత ప్రాతిపదికన కలపాలి. అధికారికంగా ఇంటర్మీడియట్ ప్లస్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పించాలి. సమపాళ్లలో సైన్స్, నాన్ సైన్స్ కోర్సులను హైస్కూలు ప్లస్‌లో చేర్చాలి. అన్ని సౌకర్యాలు కల్పించిన తరువాత హైస్కూలు ప్లస్ కోఎడ్యుకేషన్ కోర్సులను ప్రారంభించాలి.

- సీవీ ప్రసాద్,
ఏపీటీఎఫ్, అమరావతి ఆర్గనైజింగ్ సెక్రటరీ



పదోన్నతులు కల్పించాలి..



కో ఎడ్యుకేషన్ కింద మంజూరైన హైస్కూలు ప్లస్‌లో వేసవి సెలవుల్లో పదోన్నతులు చేపట్టాలి. శాశ్వత ప్రాతిపదికన పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలి. విద్యాసంవత్సరం ప్రారంభంలో బోధనా సిబ్బంది కొరత లేకుండా చూడాలి. ఉర్దూ మీడియం, హైస్కూలు ప్లస్‌లు కూడా జిల్లాలో నాలుగుచోట్ల ఏర్పాటు చేయాలి. హైస్కూలు ప్లస్‌లో ఉన్న లోటుపాట్లను తక్షణం సరిదిద్దాలి.

- ఎస్.అబ్దుల్ గఫార్, స్కూలు అసిస్టెంటు, ఇంగ్లీషు

ఆకతాయిలు పెట్టిన అగ్గితో విద్యుత్ సరఫరాకు అంతరాయం



చిన్నమాచుపల్లె పొలాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న లైన్‌మెన్లు

చెన్నూరు, ఏప్రిల్ 1: మండలంలోని చిన్నమాచుపల్లె వ్యవసాయ పొలాల్లో సోమవారం ఆకతాయిలు అగ్గి పెట్టడంతో నాలుగున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ పొలాల్లో ఎవరో నేలపై ఎండిన గడ్డికి, కంప చెట్లకు అగ్గి పెట్టడంతో వాటిపై వెళ్లే 33 కేవీ విద్యుత్‌లైన్లకు సంబంధించిన ఇన్సులేటర్లు కాలిపోయి విద్యుత్ లైన్లు వేడికి సాగాయి. దీంతో ఆందోళన చెందిన విద్యుత్ సిబ్బంది విద్యుత్ ఆఫ్ చేశారు. ఉదయం 10 గంటలకు ఈ సంఘటన జరగగ్గా మధ్యాహ్నం 2.30కు విద్యుత్ సరఫరా పునుద్ధరించారు. మంటలు ఒక్కసారిగా పైడిలేచి ఆ వేడితో తీగలు సాగి సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాన్స్ కో ఏఈ రామలింగారెడ్డి తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని చాల వరకు మంటల వేడి అదుపు చేయలేక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు మంటలు చల్లారగా సిబ్బందిని విద్యుత్ స్తంభాలపైకి ఎక్కించి రిపేరు చేసి లైన్లను బాగు చేయించడం జరిగింది.

'జగన్‌రెడ్డి అసమర్థ ముఖ్యమంత్రి'

కడప (కల్చరల్), ఏప్రిల్ 1 : ముప్పై సంవత్సరాల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిని తానే నంటూ జగన్‌రెడ్డి ప్రగల్భాలు పలికిన ఐదు సంవత్సరాలకే తన అరాచక పాలనతో అసమర్థ సీఎంగా ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. సోమవారం 28వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ గాజులపల్లె రాఘవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ గత టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు సీఎంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు యువతకు ఉపాధి అవకాశలు ఉద్యోగులకు క్రమం తప్పకుండా నెలసరి జీతాల చెల్లింపు, వృద్ధులకు పెన్షన్ పథకాలు ఆటంకం లేకుండా చెల్లించారన్నారు. ప్రజలపై పన్నుల భారం లేకుండా ఆదాయ వనరులు సృష్టించి మరీ పాలన చేశారని గుర్తు చేశారు. కాగా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎంగా జగన్‌రెడ్డి రాగానే ఇసుక, మద్యం అమ్మకాలు సిమెంటు, కరెంటు చార్జీలు, చెత్తపన్ను, ఇంటి పన్ను, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంపు ధరల పెంపు తదితర అన్నిరకాల పన్నులను ఎడాపెడా పెంచి తద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. అయినా రూ. నాలుగు లక్షల కోట్లు అప్పు చేసిన ఘనుడు జగన్‌రెడ్డినే అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి జగన్‌రెడ్డి దోపిడీ పాలనకు స్వస్తి పలికేలా టీడీపీకి పట్టంకట్టి తద్వారా చంద్రన్నను సీఎం చేయాలన్నారు. ఆ క్రమంలో కడప అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాధవీరెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు హరినారాయణ, రాఘవ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 : మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చిరంజీవి తెలిపారు.సోమవారం ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో సీతారామపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దయరసాల గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి 20 బాటిళ్లు తీసుకెళుతుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి

● వన్‌టౌన్ ప్రాంతంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు



కడప నగరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), ఏప్రిల్ 1: రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును నిర్వహించుకోవాలనే లక్ష్యంతో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సోమవారం కడప నగరంలోని వన్‌టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు... కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో కంది పాలెం, ఎర్రముక్కపల్లె, హౌసింగ్‌బోర్డు కాలనీ, రాజీవ్‌మార్గ్ ప్రధాన రహదారుల ద్వారా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు ప్రజల్లో భరోసా కల్పించేందుకు గాను ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

30 వరకు పోలీసు యాక్టు

కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్టు ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నా 24 గంటల ముందే లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి అనుమతి పొందాలన్నారు. లేదంటే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం: పుత్తా



మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 1: రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్న, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అందాలన్న చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె పంచాయతీలోని సోగలపల్లె, అగ్రహారం, సంజీవనగర్, కొత్తగంగిరెడ్డిపల్లె, గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరుతుందో వివరించారు. తల్లికి వందనం, దీపం పథకం, ఆడబిడ్డ నిధి, బీసీ చట్టం, రైతు నిధి, నిరుద్యోగ భృతి, ప్రతి ఇంటికి ఉచిత మంచినీరు తదితర పథకాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను వివరించారు. మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిది రామాంజనేయులు, టీడీపీ నాయకులు రాఘునాథరెడ్డి, సారథిరెడ్డి, అరవేటి చంద్రారెడ్డి, చెంద్రాయుడు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయండి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 1: నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆ సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీలో నూతనంగా ఎన్నికైన వారిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు జిల్లాస్థాయిలో ఎక్కువగా ఉన్నారని వారి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఆర్యవైశ్య సంఘంలో కమలాపురానికి పెద్దస్థాయిలో పదవులు రావడం సంతోషకరమన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, కడప జిల్లా ఆర్యవైశ్య సం ఘం (రూరల్) జిల్లా కమిటీలో కమలాపురం ప్రాంతానికి చెందిన అధ్యక్షులు, మండల మహిళా మండలి చుండూరు జయశ్రీ, కార్యనిర్వాహక స భ్యులు కామిశెట్టిరమణయ్య, మాలేపాటి మల్లిఖార్జున, మండల సేవాదళ్ బచ్చు సుబ్రమణ్యం, భోజనపాటి సుధాకర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం సలహా మండలి సభ్యులుగా రెడ్డిసురేష్, అంబటి సురేష్‌బాబు, గాజులపల్లి చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు.

టీడీపీతోనే విద్యార్థి, యువత భవిష్యత్తు

టీడీపీతోనే విద్యార్థి, యువతకు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమలాపురం పట్టణంలోని పీవీఎస్ఆర్ కళాశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎం అయితే రాష్ట్రంలో యువతకు భారీగా ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా సొంత రాష్ట్రంలోనే పనిచేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత యువగళం నిధులతో ఉద్యోగం వచ్చేవరకు ప్రతినెలా రూ.3వేలు ఇస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యువతకు రూ.2వేలు నిరుద్యోగభృతి కింద ఇచ్చామన్నారు. చంద్రబాబు సీఎం అయితే కాలేజీ ఫీజులు ప్రభుత్వం పాత పద్ధతిలోనే ఇస్తుందన్నారు.

భవిష్యత్ తెలుగుదేశం పార్టీదే

● కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కోడలు శ్రీచైతన్య



టీడీపీకి ఓటు వేయాలని మహిళను కోరుతున్న సరళమ్మ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 1: భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదేనని, ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రై రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింపజేస్తారని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కోడలు శ్రీచైతన్య అన్నారు. సోమవారం మండలంలోని పాయసంపల్లె, కీర్తిపల్లె గ్రామాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ఇచ్చి పథకాలను వివరించారు. మా కుటుంబానికి ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు శివమారుతిరెడ్డి సోదరుడు శివప్రసాద్‌రెడ్డి, గంగిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, మురళీధర్‌రెడ్డి, చంద్రహాసన్‌రెడ్డి, సంజీవరెడ్డి, తిరుమలరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సూరి, గండి ఓబయ్యయాదవ్, గోపాల్‌యాదవ్, సూరారెడ్డి లక్ష్మిరెడ్డి, శివలింగారెడ్డి, రామలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన భూగర్భజలాలు



ఎండిపోతున్న వరి పంట

ఖాజీపేట, మార్చి 28: సకాలంలో వర్షాలు కురవక... చెరువుల్లో నీరు లేక... ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో తాగేందుకు కూడా చుక్కనీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని కూనవారిపల్లె, అప్పనపల్లె, మల్లాయిపల్లె, పాటిమీదపల్లె, పత్తూరు, నాగపట్నం గ్రామాల్లో సాగుచేసిన పంటలు ఎండుతున్నాయి. ప్రభుత్వానికి ముందుచూపు లేక నీటి ఎద్దడి వస్తోంది. చెరువులకు నీరు నింపి ఉంటే ఇంత కష్టాలు వచ్చేవికావన్న విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో దాదాపు 1500 హెక్టార్లలో వరి, 20 ఎకరాల్లో అరటిని సాగు చేశారు. చేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో చుక్కనీరు రాకపోవడంతో సాగు చేసిన పంటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. ఎండుతున్న పంటలను చూసి రైతన్నలకు కంటనీరు వస్తోంది. కొంతమంది రైతులు ఆశ చావక బోర్లు 800 అడుగులు వేసినా నీరు లేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు అకాల వర్షంతో దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆలోటు రబీలోనైనా తీర్చుకోవాలని పంటలు సాగు చేస్తే పెట్టిన ఖర్చులు ఎకరాకు రూ.30 వేలు వరికి, అరటికి రూ.లక్షకుపైగా ఖర్చు పెట్టి అప్పులపాలయ్యారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు



అమ్మవారి జ్యోతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప (కల్చరల్), ఏప్రిల్ 1: కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జ్యోతి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. జ్యోతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి అమ్మవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా బిందెసేవకు తరలించారు. కలశాలు ధరించిన భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 11గంటలకు అమ్మవారి జ్యోతిని ఆలయ అధ్యక్షుడు కళ్యాసుధాకర్ వెలిగించారు. అనంతరం 16 జ్యోతులు, మేళతాళాలు, బాణసంచా మధ్య ఊరేగింపుగా అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు, స్వామి ఆలయ భజన బృందం మహిళలు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే మైనార్టీలకు సముచిత స్థానం

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 1: కాంగ్రెస్‌లోనే మైనార్టీలకు సముచిత స్థానం లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ నజీర్ అహమ్మద్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ కమిటీ సిఫార్సుల మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అధిష్టానం రాహుల్ గాంధీ, సోనియాగాంధీతో పాటు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట పార్లమెంట్‌లోని అన్ని నియోజక వర్గాల అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కృషి చేస్తానన్నారు. సంఘ సేవకుడు సలావుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరీఫుల్లా, అలీఖాన్, ఆర్టీఐ చైర్మన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి నిధులు లేవా?: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చెన్నూరు, ఏప్రిల్ 1 : 'ప్రతి నెలా 1వ తేదీన ఇంటికే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తాం, అవ్వ తాతల ముఖాల్లో ఆనందం చూస్తాం' అని చెప్పుకునే ఈ ప్రభుత్వానికి నేడు పింఛన్లు ఇవ్వకపోవడం సిగ్గుగా లేదా అని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.మల్లిఖార్జునరెడ్డి, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మైనార్టీ జిల్లా నేత షబ్బీర్‌హుసేన్‌లు ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ రూ.15వేల కోట్లు కాంట్రాక్టులు ఇచ్చేందుకు బిల్లుల రూపంలో చెల్లించారని, ఈ నిధులు పింఛన్లు ఆలస్యం చేసే కదా ఇచ్చిందని పేర్కొన్నారు. 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలంటే రెండు రోజుల ముందే నిధులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన మీకు ఎందుకు లేదన్నారు. పైగా ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా పెన్షన్లను వలంటీర్ల చేత పంపిణీ కాకుండా అడ్డుకున్నది టీడీపీ అని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల కమిషనే వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేయకూడదని చెప్పి ఆదేశాలు ఇస్తే దాన్ని జీర్ణించుకోలేక తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకుపోతున్నారని, కానీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కమలాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి ఆర్.సుధాకర్‌రెడ్డి, బీసీ నేత మాబు, రైతు సంఘం మండల అధ్యక్షుడు బాలక్రిష్ణారెడ్డి, బీసీ సెల్ మండల కార్యదర్శి కుందేటి క్రిష్ణయ్య, యువనేతలు శ్రీనాథరెడ్డి, గౌస్‌లాజం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వెంటనే చేపట్టాలి

వల్లూరు, ఏప్రిల్ 1 : వృద్ధులకు, వికలాంగులకు వితంతువులకు ఇచ్చే పెన్షన్లను వెంటనే పంపిణీ చేయాలని వల్లూరు మండల టీడీపీ అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో విలేకరులస మావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నెపం కారణంగా వలంటీర్లతో పింఛన్ల పంపిణీని కేంద్ర ఎన్నికల సంఘం నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చిందని, కానీ వైసీపీ నాయకులు ప్రభుత్వం టీడీపీపైనే అభాండాలు వేస్తున్నారని ఇది ఎవరూ నమ్మరని అన్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే వీటిని ఎలా పంపిణీ చేయాలో సెర్ప్‌కుఆదేశాలు అందించిందనాన్నరు. కానీ కొంత మంది నాయకులు ఓట్ల కోసమో అవాకులు చవాకులు పలుకుతున్నారని దురుద్దేశ్యంతో మాట్లాడుతున్నారే కానీ సరైన అవగాహనలేదన్నారు. తమ అధినేత చంద్రబాబు ఇప్పటికే ఎన్నికల సంఘానికి, సీఎస్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. తమ నాయకుడు పుత్తా ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఈ పింఛన్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని దురుద్దేశ్యంతో వైసీపీ మాట్లాడుతుందన్నారు. రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం తక్షణమే బృందాన్ని ఏర్పాటు చేసి వారికి ఒందేలా చూడాలని లబ్ధిదారులకు పెన్షన్లు చెల్లించాలని కోరారు. క్షేత్రాస్థాయిలో ఇబ్బందులు లేకుండా వెంటన పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఓబులేసుయాదవ్, మదన్‌మహనరెడ్డి, మైనార్టీ నాయకులు రామచంద్రరెడ్డి, ఎస్సీ నాయకులు పుల్లగూర శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాట తప్పిన జగన్

● పేరుకే కార్పొరేషన్లు ఏర్పాటు... నిధులు మాత్రం సున్న

● నేరచరిత్రను కలిగిన పార్టీ వైసీపీ

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కేఏన్ రాజు, చిన్న సుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కేఎన్ రాజు, చిన్న సుబ్బయ్య, పాల్గొన్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 1: ఎస్సీ వర్గీకరణ న్యాయబద్దమైనదని 2019 ఎన్నికల ముందు చెప్పి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణను చేస్తామని అధికారం చేపట్టిన తర్వాత ఎస్సీ కులాన్ని ఎబిసిడి వర్గీకరణ చేయడం చట్ట విరుద్ధమని, ఇది మా చేతుల్లో లేదని మాట తప్పడం అన్యాయమని రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి బీటెక్‌రవితో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కేఎన్ రాజు, చిన్నసుబ్బయ్యలు మాట్లాడుతూ 1999 నుంచి 2019 వరకు దివంగత నేత వైఎస్సార్, నారాచంద్రబాబునాయుడులు ఎస్సీ కుల వర్గీకరణకు మద్దతు ఇచ్చారని, దీనికి రాజ్యాంగ సవరణ అవసరమైనందున కోర్టులో కొట్టివేయడం జరిగిందన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పార్లమెంటులో ఒత్తిడి తెస్తామని చెప్పి ప్రభుత్వం చేపట్టిన తర్వాత జగన్ చట్ట విరుద్ధమని చేతులెత్తేశారన్నారు. నాలుగు సంవత్సరాలుగా మాదిగల అభ్యున్నతికి పాటుపడిన జగన్ నేడు ఓట్ల కోసం మాదిగలను ఏవిధంగా అడుగుతున్నాడో అర్థం కావడం లేదు అన్నారు. ఎస్సీ కులానికి సంబంధించి మూడు కార్పొరేషన్లు ఏర్పాటుచేశారని కానీ నిధులు మాత్రం కేటాయించలేదని అటువంటప్పుడు కార్పొరేషన్ ఏర్పాటుచేసి లాభమేమన్నారు. వైఎస్సార్, చంద్రబాబు ఎస్సీలకు సంబంధించి 27 సంక్షేమ పథకాలు ఏర్పాటుచేశారని కానీ జగన్ వచ్చిన వెంటనే 27పథకాలను రద్దుచేసి మాదిగలకు అన్యాయం చేశారన్నారు.

బెల్టుగ్రేడింగ్ టెస్టులో పవన్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న లెక్కల జోగిరామిరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: పవన్ స్కూలు విద్యార్థులు 30మంది బెల్టుగ్రేడింగ్ టెస్టులో సుమారు మూడుగంటల పాటు సాధన చేసి ఫ్లయిన్ అరేంజ్ గ్రీన్ టు బెల్టుకు ప్రమోట్ అయినట్లు పవన్ స్కూలు కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. ఫ్లయిన్ అరేంజ్‌మెంటు బెల్టు ప్రమోషన్‌లో ఎస్.సఫాన్, పి.జయకార్తీక్‌రెడ్డి, ఎం.నయనిత, వర్షిత, ఎస్.ఫాతిమా, ఎస్.ఉమే మినహా, వై. జయశయంత్‌కుమార్, ఎం.మోహన్, ఎస్.అఫ్సాన్, రేవంత్, బి.కుమారస్వామి, కె.దుర్గహర్షవర్థన్‌రెడ్డి, ఎం.రాఘవమహేంద్ర, మహేంద్ర, సంతోష్, ఎస్ఎండీ ఖైట్, ఎం. నందమురళి ప్రమోట్ అయ్యారన్నారు. అలాగే గ్రీన్‌బెల్టు ప్రమోషన్‌లో పలువురు ప్రమోట్ అయినట్లు తెలిపారు. విద్యార్థులను పవన్ స్కూలు అధినేత జోగిరామిరెడ్డి అభినందించి బెల్టు, సర్టిఫికట్ అదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8 నెలలు కోచింగ్ తీసుకుని వివిధ స్టేట్, నేషనల్ లెవల్‌లో పాల్గొని గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు.

లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణ అవసరం : వీసీ సూచన



వైస్ చాన్సలర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 1: నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు క్రమశిక్షణ అవసరమని అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. సోమవారం పులివెందుల జేఎన్టీయూ కాలేజ్ డే, క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీకి ఘనస్వాగతం పలికి శాలువతో సత్కరించారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి చదువే కాకుండా క్రీడలు కూడా భాగంగా చేసుకోవాలని సూచించారు. పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డాక్టర్ దామోదర రెడ్డి క్రీడల ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రోడ్‌షోకు ప్రజల బ్రహ్మరథం: టీడీపీ

● ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1 : మండుటెండను కూడా లెక్కచేయక టీడీపీ అధినేత చంద్రబాబు రోడ్‌షోకు ప్రొద్దుటూరు ప్రజలు బ్రహ్మరథం పట్టారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కు మండుటెండలోనూ అధిక సంఖ్యలో జనం వచ్చారు, కానీ జగన్ సాయంత్రం మీటింగ్ పెట్టినా జనం ఎందుకు రాలేదని రాచమల్లు బాధతో టీడీపీపై విమర్శిస్తున్నారన్నారు. మట్కా, గుట్కా,క్రికెట్ బెట్టింగ్, జూదం, నకిలీ నోట్లు, భూదందాలకు పాల్పడివుంటే ప్రొద్దుటూరు ప్రజలు ఓటు వేయవద్దని రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కోరాడన్నారు. అదే మాట మీద నిలబడి రాచమల్లు ఓట్లడగాలన్నారు. 27వతేదీ పెట్టిన జగన్ సభకు జిల్లా నలుమూలల నుంచి జనాన్ని తరలించారు, కానీ 30వతేదీ చంద్రబాబు రోడ్‌షోకు కేవలం ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి వచ్చినవారితోనే రోడ్ షో సక్సెస్ అయిందన్నారు. రాచమల్లుతో పాటు బంగారురెడ్డి కూడా 250 కోట్లరూపాయలు, ఎంపీపీ శేకర్ యాదవ్ 100 కోట్లు అక్రమ ఆస్తులు సంపాదించారన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైదుకూరు, ఏప్రిల్ 1 : స్థానిక 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మంగళ, బుధవారాల్లో మరమ్మతులు చేస్తున్నారని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మైదుకూరు డివిజన్ పరిధిలోని 132/33 కేవీ బద్వేలు, పోరుమామిళ్ళ, కలసపాడు, బ్రహ్మంగారిమఠం సబ్ స్టేషన్లకు కడప నుంచి విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

అట్లూరు, ఏప్రిల్ 1 : మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద బద్వేలు - కడప ప్రధాన రహదారి పక్కనే చెండువాయి కాలనీకి సంబంధించి కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వస్థలాన్ని కొందరు వైసీపీ నాయకులు పట్టపగలేఎక్స్‌కవేటర్‌తో చదను చేసి కబ్జాకు ప్రయత్నించారు. దీంతో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, బద్వేలు ఎస్సీ సెల్ అధ్యక్షుడు రిషికేశవ, చెండువాయి కాలనీకి సంబంధించిన అట్లూరు గోపయ్య, మరికొందరు స్థానికులు తహసీల్దారు , ఎంపీడీవో కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు చదును చేసిన ఎక్స్‌కవేటర్ యంత్రాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మద్యం సీసాలు స్వాధీనం

కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 : మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చిరంజీవి తెలిపారు. సోమవారం ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో సీతారామపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దయరసాల గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లే కుండా 20 మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

పొలాన్ని పరిశీలించిన వ్యవసాయాధికారులు



జమ్మలమడుగు, ఏప్రిల్ 1: జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామ పొలంలో వరి పంటను వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'వరికి తెగుళ్లు - ఆందోళనలో అన్నదాత' రెండు నెలల పంటను మిషన్లతో కోతపెడుతున్న రైతులు, 150 ఎకరాలకు వరి పంటకు తెగుళ్లు అనే కథనం ప్రచురితమైంది. వెంటనే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జమ్మలమడుగు ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది కన్నెలూరు గ్రామం గొరిగెనూరు గ్రామాల మధ్య తెగుళ్లు సోకిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటను తమ సిబ్బంది ఈ-క్రాప్ చేశారన్నారు. గొరిగెనూరు గ్రామ పొలంలో చౌడు భూముల్లో వరి సాగు రైతులు చేయకూడదని, అయినా చౌడు భూముల్లోనే వరి సాగు చేశారన్నారు. చౌడు భూములు పంటలకు అనుకూలం కాదని, ఎదుగుదల లేదన్నారు. తెగుళ్లు సోకిన వరి పంటలో రెండు గ్రాములు జింక్‌సల్ఫేట్, 10 గ్రాములు 19:19:19 స్ప్రే చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 1: ఒత్తిడి నుంచి బయట పడటానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని నితిన్ చింతలపూడి పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనపై అవగాహన కల్పించడానికి తిరుమల నుంచి విజయనగరానికి సైకిల్‌యాత్ర చేపట్టిన ఆ యువకుడు సోమవారం ప్రొద్దుటూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ, భగవద్గీత పఠనాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. విజయనగరంలోని రామనారాయణ మందిరంలో స్వామివారి దర్శనంతో సైకిల్ యాత్ర ముగించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



గ్రామ దేవత పూజకు హాజరైన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 1: జమ్మలమడుగు మండలంలోని గండికోట గ్రామంలో గ్రామ దేవత (పెద్దమ్మ అమ్మవారు) దేవర జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. గండికోటలో గ్రామదేవత అమ్మవారి దేవర కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన గండికోటను సందర్శించి గ్రామ దేవత దేవరతో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కిరణ్‌రాయల్, సర్పంచ్ ఈశ్వర్, ప్రసాద్, వినోద్, గురుస్వామి, దామోదర్, మునిశేఖర్, రవి, చంద్రప్రతాప్, వెంకటకృష్ణయ్య, ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 1 : స్థానిక మూడో సర్కిల్, రూరల్ సర్కిల్ పరిధుల్లో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. త్రీటౌన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. రాజీవ్ సర్కిల్, టీబీ రోడ్డు, విజయకుమార్‌సర్కిల్, బొల్లవరం, లింగయ్యకాలనీ, జంగంపేట రహదారుల గుండా సాధారణ పోలీసు, ఎంపీఆర్‌ఎఫ్ కేంద్ర బలగాలతో స్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. రూరల్ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం చెన్నమరాజుపల్లి, కామనూరు గ్రామాలలో కేంద్ర బలగాలతో మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. గ్రామాల్లో ఉన్న భయాందోళనలు పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాబు రోడ్‌షోకు ప్రజల బ్రహ్మరథం

విమర్శలను ఎదుర్కోలేక ఫ్రస్టేషన్‌కు గురవుతున్న రాచమల్లు ● ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1 : మండుటెండను కూడా లెక్కచేయక టీడీపీ అధినేత చంద్రబాబు రోడ్‌షోకు ప్రొద్దుటూరు ప్రజలు బ్రహ్మరథం పట్టారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు మండుటెండలోనూ అధిక సంఖ్యలో జనం వచ్చారు, కానీ జగన్ సాయంత్రం మీటింగ్ పెట్టినా జనం ఎందుకు రాలేదని రాచమల్లు బాధతో టీడీపీపై విమర్శిస్తున్నారన్నారు. మట్కా, గుట్కా,క్రికెట్ బెట్టింగ్, జూదం, నకిలీ నోట్లు, భూదందాలకు పాల్పడివుంటే ప్రొద్దుటూరు ప్రజలు ఓటు వేయవద్దని రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కోరాడన్నారు. అదే మాట మీద నిలబడి రాచమల్లు ఓట్లడగాలన్నారు. 27వతేదీ పెట్టిన జగన్ సభకు జిల్లా నలుమూలల నుంచి జనాన్ని తరలించారు, కానీ 30వతేదీ చంద్రబాబు రోడ్‌షోకు కేవలం ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి వచ్చినవారితోనే రోడ్ షో సక్సెస్ అయిందన్నారు. రాచమల్లుతో పాటు బంగారురెడ్డి కూడా 250 కోట్లరూపాయలు, ఎంపీపీ శేకర్ యాదవ్ 100 కోట్లు అక్రమ ఆస్తులు సంపాదించారన్నారు. రాచమల్లు ఫ్లెక్సీలు చింపిన వారు చిన్ని కృష్ణుడు, సుల్తాన్ అనే వారని వారు పెన్నా నగర్ ఈశ్వరరెడ్డినగర్‌కు చెందినవారని వారిని పోలీసులు విచారిస్తున్నారన్నారు.

సచివాలయాల్లో సామాజిక పెన్షన్ పంపిణీ

3నుంచి 5 తేదీ వరకు తీసుకోవచ్చు : మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్లద్వారా ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ ఉండదని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన పెన్షన్ పంపిణీ పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 5 తేదీ వరకు ఆయా వార్డు సచివాలయాల్లో సామాజిక పెన్షన్లు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్ దారులు సీఎం జగన్ బొమ్మ వున్న పాసుపుస్తకాలు సచివాలయాలకు తీసుకోని రావద్దని తెలియజేయాలన్నారు. కేవలం ఆధార్ కార్డు మాత్రమే పెన్షన్‌దారులు తీసుకురావలన్నారు. ప్రతి సచివాలయంలో పెన్షన్‌దారులు ఎటువంటి తొక్కిసలాట లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెన్షన్ దారులకు వేసవి ఎండల ఉన్నందున సచివాలయాల వద్ద నీడకోసం ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో వుంచాలన్నారు. మూడు రోజుల్లో ఎటువంటి సమస్యలు రాకుండా పెన్షన్ పంపిణీ పూర్తి కావలన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కేటాయించాలి



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

బద్వేలు, ఏప్రిల్ 1:నియోజకవర్గంలోని గోపవరం సెంచురి ప్లైవుడ్ ఫ్యాక్టరీలో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఓబయ్య డిమాండ్ చేశారు.సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1600 కోట్ల రూపాయల పెట్టుబడితో ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన 850 ఎకరాల భూమిని గోపవరం మండల ప్రజల నుంచి సేకరించి 105 ఎకరాలలో ఫ్యాక్టరీ నిర్మాణం జరిగి ఉత్పత్తి ప్రారంభమైతే ప్రత్యక్షంగా 2 వేలు పరోక్షంగా 4వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. అందులో మొదటి ప్రాధాన్యతరాయలసీమ వాసులకు దక్కుతుందని ఆశపడ్డామని, కానీ మొండిచేయి మిగిలిందన్నారు. ఫ్యాక్టరీలో 1000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా అందులో 200 మంది కూడా స్థానికులు లేకపోవడం బాధాకరమని, భూమిని కోల్పోయిన దళితులకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ధర్నా అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక బద్వేలు ఏరియా కార్యదర్శి జకరయ్య, పట్టణ కార్యదర్శి బాబు, రామరాజు పాల్గొన్నారు.

'జగన్ కుట్రతోనే పింఛన్లు ఆలస్యం'

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 1: జగన్‌మోహన్‌రెడ్డి కుట్రతోనే అవ్వాతాతలకు పింఛన్లు ఆలస్యం అవుతున్నాయని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకరవేణుగోపాల్ విమర్శించారు. సోమవారం జరిగిన టీడీపీ బీసీసెల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సినవలంటీర్లు వైసీపీ కార్యకర్తలుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడంతో ఎన్నికల సంఘం పింఛన్ల పంపిణీ నుంచి వారిని పక్కనబెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను పక్కనబెట్టిన విషయాన్ని తప్పుదోవ పట్టిస్తూ తెలుగుదేశం పార్టీపై విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేదికం సుదర్శన్, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు, తెలుగుయువత నాయకులు మహేష్‌బాబు, సమర, పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం కుట్ర

అట్లూరు, ఏప్రిల్ 1 : పింఛనుదారులకు పంపిణీ విషయంలో వైసీపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెడ్డిపల్లె టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు రావడంతో ఎన్నికల కమిషన్ వారిని దూరం పెట్టాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వం అదే సాకుతో 1వతేదీన పింఛన్లు పంపిణీ చేయకుండా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలపై బురద చల్లుతోందన్నారు. వెంటనే పంచాయతీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, జయక్రిష్టారెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రిషికేశవ, వరికుంట సర్పంచ్ గోపాల్, చిన్న రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పెన్షన్లు అందించాలి

బి.కోడూరు, ఏప్రిల్ 1 : గతంలో పెన్షన్లు పంచాయతీ సెక్రటరీలు ప్రతి గ్రామానికి వెళ్లి ఒకట్రెండు రోజుల్లో అందించేవారని, ఇప్పుడు కూడా అదే మాదిరి పంపిణీచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం వలంటీర్లు చేత పింఛను పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషన్ తెలిపినప్పటికీ వైసీపీనేతలు టీడీపీ వారు ఏదో చేశారని అనుకుంటున్నారని అది సబబుకాదన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ శిలాఫలకాలకే పరిమితం

మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



కండువా కప్పుతున్న సుధాకర్‌యాదవ్

చాపాడు, ఏప్రిల్ 1: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి చేయకుండా కేవలం శిలాఫలకాలకే పరిమితం అయ్యాడని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. పెద్దగురవలూరు గ్రామంలో సోమవారం సాయంత్రం వైసీపీకి చెందిన 150 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. సుధాకర్‌యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో సింగిల్‌విండో అధ్యక్షుడు పాలగిరి వేమారెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామ సర్పంచ్ రాజేష్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పుల్లయ్య, వీరారెడ్డి, శ్రీనివాసులు, యల్లారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, బాలకొండయ్య, జమాల్‌వలి, ఖలీల్‌బాష, దాదాపీర్, ఇంకా 140 కుటుంబాలవారు ఉన్నారు. పెద్దగురవలూరు, శ్రీరాములపేట, ఓబుళరెడ్డిపేట గ్రామాల వారు టీడీపీలో చేరారు. మైదుకూరు నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధే తన ఆకాంక్ష అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, జనసేన పార్టీ మైదుకూరు ఇన్‌చార్జి మల్లోత్ర, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్ యాదవ్, బయపురెడ్డి, మేకలబాబు, క్రిష్టారెడ్డి, సుబ్బరాయుడు, పసల రమణ, తదితరులు పాల్గొన్నారు.

'పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపు తథ్యం'



సూపర్-6 పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

ఖాజీపేట, ఏప్రిల్ 1: మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపు తథ్యమని ఖాజీపేట టీడీపీ నాయకులు కమలాపురం గౌస్, కాంతమ్మ అన్నారు. సోమవారం ఖాజీపేటలోని టీచర్స్ కాలనీలో ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇర్ఫాన్, సిద్దారం మహబూబ్‌బాష, నజీర్‌అహమ్మద్, రాము, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బొజ్జా రోశన్న



పోరుమామిళ్లలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 : మిత్రపక్షం అయిన బీజేపీ తరపున బద్వేలు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న సోమవారం పోరుమామిళ్లలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కాపువీధి, రామాయణపువీధిల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీని ఆదరించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, తెలుగుయువత అధ్యక్షులు సీతాబాలాజీ, కరిముల్లా, అన్వర్, బీజేపీ నాయకులు పండరి, రమణాచారి,పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, నగరి భైరవ ప్రసాద్, సీతా వెంకటసుబ్బయ్య, మస్తాన్‌వలి, బండి ఓబులేసు, షరీఫ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగేదేమీలేదు : తులసిరెడ్డి



మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 1: ప్రాంతీయ పార్టీల వలన రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీరని అన్యాయం, ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోదీ భజన చేస్తూ భజన్‌రెడ్డిగా మారిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీఎండీ నజీర్, పట్టణాధ్యక్షుడు జిలానీబాష, రషీద్, రామాంజనేయులు, ఖాజాపీర్, గౌసలాజం, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన భూగర్భజలాలు

● బోర్లకు అందని నీరు - ఎండిపోతున్న అరటి, వరి పంటలు



ఎండిపోతున్న వరి పంట, నీరు లేక విరిగి పడిపోయిన అరటి పంట

ఖాజీపేట, ఏప్రిల్ 1: సకాలంలో వర్షాలు కురవక... చెరువుల్లో నీరు లేక... ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో తాగేందుకు కూడా చుక్కనీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని కూనవారిపల్లె, అప్పనపల్లె, మల్లాయిపల్లె, పాటిమీదపల్లె, పత్తూరు, నాగపట్నం గ్రామాల్లో సాగుచేసిన పంటలు ఎండుతున్నాయి. ప్రభుత్వానికి ముందుచూపు లేక నీటి ఎద్దడి వస్తోంది. చెరువులకు నీరు నింపి ఉంటే ఇంత కష్టాలు వచ్చేవి కావన్న విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో దాదాపు 1500 హెక్టార్లలో వరి, 20 ఎకరాల్లో అరటిని సాగు చేశారు. చేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో చుక్కనీరు రాకపోవడంతో సాగు చేసిన పంటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. ఎండుతున్న పంటలను చూసి రైతన్నలకు కంటనీరు వస్తోంది. కొంతమంది రైతులు ఆశ చావక బోర్లు 800 అడుగులు వేసినా నీరు లేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు అకాల వర్షంతో దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆలోటు రబీలోనైనా తీర్చుకోవాలని పంటలు సాగు చేస్తే పెట్టిన ఖర్చులు ఎకరాకు రూ.30 వేలు వరికి, అరటికి రూ. లక్షకుపైగా ఖర్చు పెట్టి అప్పులపాలయ్యారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో కోతలు... రైతులకు వెతలు

7 గంటలనుంచి 4 గంటలకే సరఫరా కుదింపు ● ఎండిపోతున్న వరి పైర్లు ● ఆందోళనలో అన్నదాతలు



డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1 : వ్యవసాయ బోర్లకు విద్యుత్ కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే ఈ ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు 9 గంటల విద్యుత్ సరఫరా నుంచి 7 గంటలకు కుదించారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా వుంటే వారం రోజులుగా వ్యవసాయ విద్యుత్ సరఫరాను ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని గ్రామాల్లో 7 గంటలనుంచి 4 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అసలే వేసవి ఎండలు మండుతున్న సందర్భంలో బోర్లలో నీటి మట్టం పడిపోతుంటే మరోవైపు విద్యుత్‌సరఫరాను కేవలం నాలుగు గంటలు మాత్రమే సరఫరా చేస్తుంటే పంటలు ఏమి కావాలని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు వరిపంట తెగుళ్ళ బారిన పడుతుంటే మరోవైపు నీళ్లు పారక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ సారి విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయి ఆఖరి కి గ్రాసం కూడా దక్కని పరిస్థితులు ఏర్పడనున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్నా పరీవాహక గ్రామాల్లో బోర్ల క్రింద వ్యవసాయం చేసే రైతులు వేసిన పంటలకు ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల తీవ్రంగా నష్ట పోతారని ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ పరిధిలో దాదాపు 20,560 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. డివిజన్ పరిధిలో నాలుగు గంటలనుంచి 7గంటల వరకు విద్యుత్ పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా సోమవారం ప్రొద్దుటూరు డివిజన్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళనల చేశారు.

కడపకు నీటి తరలించడం కోసం విద్యుత్ కోతలు

మైలవరం రిజర్వాయర్‌నుంచి పెన్నానదిగుండా కడపకు తాగునీటిని తీసుకువెళ్లడానికి పెన్నా పరీవాహక ప్రాంతాలలో వున్న బోర్లకు విద్యుత్ సరఫరాను 7 గంటనుంచి 5 గంటల వరకు కుదించాం. కేవలం పెన్నానదిలో నీటిప్రవాహం కడపకు చేరాలంటే నది పరీవాహక ప్రాంతాల్లో బోర్లు ఆడుతే పెన్నానదిలో నీరు కడపకు వెళ్లవని ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కుదించాం. ఏప్రిల్ 5నుంచి అధికారులు ఆదేశిస్తే 7 గంటల విద్యుత్ వ్యవసాయ బోర్లకు పునరుద్ధరిస్తాం

- శ్రీనివాసులరెడ్డి డివిజన్ ఈఈ, ఏపీఎస్పీడీఎల్.